

చంద్రబాబు అభివాదం



రైతన్నా- మీ కోసం



నల్లజర్ల రైతన్నా - మీ కోసం సభలో నులక మంచంపై కూర్చుని రైతుల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు చిత్రంలో మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మద్దిపాటి, కలెక్టర్ కీర్తి, బాపిరాజు

నేనున్నా!

అండగా ఉంటా..ఆదుకుంటా

- చెట్టు కింద.. నులక మంచంపై సీఎం సభ
- హంగూ ఆర్భాటం లేకుండా నిర్వహణ
- రైతుల సమస్యలు విన్నారు..
- సలహాలు స్వీకరించారు..
- మీరు చెప్పింది చేస్తా అంటూ భరోసా
- నల్లజర్లలో చంద్రబాబు సభ సక్సెస్

(రాజమహేంద్రవరం/నల్లజర్ల/గోపాలపురం/కొవ్వూరు/ దేవరపల్లి - ఆంధ్రజ్యోతి)

మీ సమస్యలు చెప్పండి.. వింటా.. పరిష్కరిస్తా.. అంటూ సీఎం చంద్రబాబు రైతులతో కలిసిపోయారు.. నల్లజర్లలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో సాధారణ నులక మంచంపై కూర్చుని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా సీఎం చంద్రబాబు చెట్టుకింద కూర్చుని రైతులు చెప్పింది ఆసక్తిగా విన్నారు.. సూచనలు.. సలహాలు స్వీకరించారు.. మీరు చెప్పింది నేను చేస్తా అంటూ వారి భరోసానిచ్చారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల జాతీయ రహదారికి సమీపాన బుధవారం జరిగిన రైతన్నా-మీకోసం కార్యక్రమం ఎవరూ ఊహించని విధంగా సభ ఏర్పాటు చేశారు. ఆరంభం నుంచి చివరి వరకూ వినూత్నంగా.. ఆసక్తిగా జరిగింది. ఉదయం 12 గంటలకు ఆరంభమైన చంద్రబాబు పర్యటన సాయంత్రం ఐదు గంటల వరకూ సాగింది. మొదట ఒక రైతు పొలంలో వేసిన వివిధ పంటలను సీఎం స్వయంగా పరిశీలించారు.ఒకేచోట వివిధ రకాల మొక్కలు పెంచడంపై ఆరా తీశారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఐదు స్టాల్స్‌ను తిలకించారు.ఆ స్టాల్స్‌లో వస్తువుల గురించి అధికారులు వివరించగా ఆయన విని.. వారిని అభినందించారు. రెండు గంటల సమయంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ పోతవరం రోడ్డు సమీపంలో ఓ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలతో సమీక్షించారు.తొలుత చంద్రబాబు భూగర్భజలాలు, పంటల మార్పిడి, ఆదాయం, యంత్రాల వినియోగం, లాభ సాటి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పంటల సాగు వంటి వాటి గురించి ప్రస్తావించారు. సభ ఏర్పాట్లు బాగా చేసినందుకు కలెక్టర్ కీర్తి చేకూరిని, నియోజకవర్గంలో బాగా పనిచేస్తున్నందుకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును అభినందించారు.కలెక్టర్ కీర్తి చంద్రబాబును సన్మానించారు.రోడ్ల పొడవునా కార్యకర్తలు బారులు తీరారు. పోలీసులు బందోబస్తు, భారీ భద్రత ఏర్పాట్లు చేశారు.గోపాలపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.320 కోట్ల ప్రణాళికను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సీఎంకు అందజేశారు. నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహ కిశోర్, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన నేత సువర్ణరాజు, మహిళా నేతలు స్వాగతం పలికారు.

రైతులకు అండగా : ఎమ్మెల్యే మద్దిపాటి



రైతుల ఆదాయం పెంచే విధంగా తమ ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకొచ్చి రైతు కుటుంబానికి అండగా ఉంటుంది. 25 ఏళ్ల కిందట చంద్రబాబు ఇంకుడు గుంతలు తవ్వండి, చెక్ డ్యామ్‌లు కట్టండి అంటే ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితిలో రైతులే ఇంకుడు గుంతలు కావాలంటున్నారు.. చంద్రబాబు విజన్ ఇలా ఉంటుంది. నదులను అనుసంధానం చేశారు. రైతుకు ఏది అవసరమో అది చేస్తారు.



ఎలా ఉన్నావయ్యా : ఎమ్మెల్యే నల్లమిల్లి, అనపర్తి ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డితో మాట్లాడుతున్న సీఎం

నేనూ వ్యవసాయం చేసేవాడిని..

నేను కూడా రైతు బిడ్డనే.. వ్యవసాయం చేసేవాడిని.. రైతు కష్టమేంటో తెలిసినవాడిని..అయితే రాజకీయాల్లోకి వచ్చా. ఇవాళ రైతులు చదువుకున్నవారు ఉన్నారని.. పీజీలు, పీహెచ్‌డీలు చేసినవారున్నారని.. అందరూ ప్యాంట్లు వేసుకుని వచ్చారని..మోడరన్ రైతులయ్యారని జోకులు వేయడంతో అందరూ నవ్వుకున్నారు. సభలో సీఎం చంద్రబాబు ఇద్దరు రైతులను తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. అందులో ఒకరు ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ నీలపాల నరసింహం కుడి వైపు కూర్చోగా, నల్లజర్లకు చెందిన గుదే అర్జునరావు ఎడమ వైపు కూర్చున్నారు.



వెల్‌కమ్ సార్ : సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిశోర్

అధిక శాతం మఫ్టీలోనే.. నిఘాకు ప్రాధాన్యం



విజిబుల్ పోలీస్.. ఇన్‌విజిబుల్ పోలీసింగ్.. ఇది సీఎం చంద్రబాబు పదే పదే పోలీసులకు చెప్పేమాట. ఆయన నల్లజర్ల పర్యటనకు జిల్లా పోలీసులు ఆ మాటను నిజం చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నరసింహ కిశోర్ 1300 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 12 సెక్టార్లుగా విభజించి నలుగురు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 63 మంది ఎస్ఐలు, మిగతా సిబ్బందిని నియమించారు. 7 స్పెషల్ పార్టీలు, 25 రోప్ పార్టీలు, 5 ఏరియా డీవీఎం పార్టీలను బందోబస్తులో భాగం చేశారు. ఈసారి సుమారు 60 శాతం మందికి యూనిఫాం వేయలేదు. మఫ్టీలోనే జనాల్లో తిరుగుతూ అనుపానులు గమనించారు. మహిళా పోలీసులను మఫ్టీలో మోహరించారు. కీలకమైన ప్రాంతాల్లోని కెమెరాలను డీజీపీ, నిఘా చీఫ్ కంట్రోల్‌కి అనుసంధానించారు. డ్రోన్ల ఫుటేజీలను నిరంతరం పరిశీలించారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఇద్దరు చొప్పున బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.



ఏంటివి : కొబ్బరి పీచుతో తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి దుర్గేష్



సభకు హాజరైన రైతులు

1.14 లక్షల మంది రైతు కుటుంబాలను కలిశాం : కలెక్టర్

నవంబరు 24 నుంచి 30వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లాలో లక్షా 14 వేల రైతు కుటుంబాలను కలిశాం. ఇంటింటికి వెళ్లి సీఎం సందేశ లేఖను అందించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ సాంకేతికత, విలువవృద్ధి, ప్రభుత్వ సమన్వయం అనే పంచసూత్రాల అమలుతో వ్యవసాయరంగం బలోపేతవుతుందని 'తూర్పు' జిల్లా కలెక్టర్ కీర్తి పేర్కొన్నారు.

ఆదర్శ రైతులకు సత్కారం





సీఎం సమక్షంలో ఆదర్శ రైతులు సింగరాజుపాలెం గ్రామానికి చెందిన దొండపాటి లక్ష్మీనారాయణ(బాబు), గుండుగొలనుగుంటకు చెందిన ఒబెలిశెట్టి గోపాలకృష్ణ, కురుకూరుకు చెందిన యెలమతి భాస్కరరావు, దుద్దుకూరుకు చెందిన కాకర్ల హరినాథ్, చిట్యాలకు చెందిన గద్దె హరిశ్చంద్రప్రసాద్, యర్నగూడెం గ్రామానికి చెందిన గద్దె మునేశ్వరరావు, వాదాలగుంటకు చెందిన గేద జోగేంద్ర ప్రసాద్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు.

విశాఖ-తిరుపతి మధ్య ఎనిమిది ప్రత్యేక రైళ్లు

తెలుగు వర్శిటీకి శీలా వీర్రాజు పుస్తకాలు

22న నన్నయలో జాతీయ సెమినార్


8



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కమిషనర్ రాహుల్ మీనా, చిత్రంలో ఎమ్మెల్యేలు వాసు, ముప్పిడి

కార్పొరేషన్‌కు అవార్డు.. సీఎం అభినందన

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ప్రతిష్టాత్మక జన్ భాగీరథీ 1.0 జాతీయ స్థాయి అవార్డు అందుకోవడం పట్ల సీఎం చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు. నల్లజర్లలో బుధవారం నిర్వహించిన రైతన్నా మీ కోసం సభకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు అవార్డు సర్టిఫికెట్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా చూపించారు.ప్రతిష్టాత్మక అవార్డు పట్ల వారిని సీఎం అభినందించారు.



ఇదేంటి బాస్!

అవినీతి అడ్డాలుగా పోలీస్ స్టేషన్లు



- ప్రతి స్టేషన్‌లో మామూలే
- లబోదిబోమంటున్న బాధితులు
- సీఐల రూటు.. సెపరేటు
- పేకాట బోర్డులు..సారాకు కొమ్ము
- అర్ధరాత్రి హోటళ్లకో రేటు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు స్టేషన్లపై ఆరోపణలు తీవ్రంగా వస్తున్నాయి.సామాన్యుల గోడు పట్టించుకునే వారే కరువయ్యారు. న్యాయం చేయండి మహాప్రభో అని వెళితే.. మా ఇంటి కొస్తే ఏం తెస్తారు.. మీ ఇంటికొస్తే ఏమిస్తారు అనే నానుడిని స్టేషన్‌లోని ఎవరి సామర్థ్యం కొద్దీ వారు నిజం చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ తీరు బాధితులను మరింత ఆవేదనకు గురి చేస్తోంది. జిల్లాలోని ఎస్పీ వద్ద అత్యంత కీలకమైన పోస్టులో ఎలాంటి ఆదేశాలు లేకుండానే విధులు నిర్వహిస్తున్న ఓ సీఐ పేరును ప్రస్తావిస్తూ ఓ మహిళ డీజీపీ కార్యాలయం వద్ద దుమ్మెత్తిపోశారు.ఒకసారి సస్పెన్షన్‌కి సైతం గురైనా జిల్లా స్థాయిలో కీలకమైన విధు లు అప్పగించ డంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఇదే సీఐ తీరుతో ఇప్పుడు జిల్లాలోని చాలా మంది సీఐలు లోలోపల కుమిలిపోతున్నారు.

రూ.15 వేలిస్తేనే.. బైక్ ఇస్తాం..

కొవ్వూరులోని ఓ రైతు తన ద్విచక్ర వాహనాన్ని మరమ్మతు నిమిత్తం మెకానిక్‌కి ఇవ్వగా మాయమైంది. రాత్రి ఒక యువకుడు బైక్ చోరీకి పాల్పడినట్టు సీసీ ఫుటేజీల ద్వారా తెలిసింది.ఆ బైక్ రాజమ హేంద్ర వరంలోని హైవే పక్కన ఉన్న ఓ స్టేషన్ పరిధిలో రోడ్డు పక్కన దొరికింది. పోలీసుల కూపీ లాగి బైక్ యజమా నికి ఫోన్ చేయగా స్టేషన్‌కు వచ్చాడు.రూ.15 వేలు ఇవ్వాలంటూ అతనితో స్టేషన్‌లో బేరం పెట్టారు. బాధి తుడు అంత ఇచ్చుకోలేనని చెబి తే.. 2015 మోడల్ కాబట్టి ఆ రేటు.. 2025 అయితే రూ.50వేలు కట్టాల్సిందేనంటూ గద్దించా రు. చివరికి కాళ్లావేళ్లా పడితే రూ.5వేలు స్టేషన్ తీసుకొని బైక్ అప్పగించారు.

అందని న్యాయం..

పోలీస్ స్టేషన్లలో చేయి తడిపితేనే పనవుతోంది. ఏ చిన్న పనిపై వెళ్లినా ఎంతో కొంత ముట్టచెప్పి రావాల్సిందే మరి..దీంతో చాలా మంది పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు.పోలీస్ స్టేషన్ స్థాయిలో సామాన్యులకు న్యాయం జరగడంలో జాప్యం జరుగు తోందనే అపవాదులు వినవస్తున్నాయి. పెద్ద కేసుకు ఒక తీరు, సామాన్యుడైతే మరో ప్రవర్తన కనిపిస్తోంది. పలు స్టేషన్ల వద్ద సాయంత్రం, రాత్రి వేళల్లో గుంపులు ఎందుకు కనిపిస్తున్నాయో ఇప్పటికీ సమాధానం దొరకని ప్రశ్నగానే ఉంది. ఎఫ్ఐఆర్‌లు వేయడానికి అర్ధరాత్రి ముహూర్తాలు అధికమైపోయాయి. ఇక తమ గోడును ఎస్పీకి వినిపిస్తేనే న్యాయం జరుగుతుందనే నమ్మకంతో అపసోపా లు పడి జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌కి బాధితులు క్యూ కడుతున్నారు.వీరిలో పేద మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా సీఐ సార్లు ఎస్పీ కార్యాలయంపై సైతం నిఘా పెడుతున్నారంటే ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. ఎస్పీ గ్రీవెన్స్ రోజున ఏదోక పనిపై స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌ని ఎస్పీ కార్యాలయానికి సీఐ పంపిస్తున్నారు. అక్కడ ఫిర్యాదుదారులంతా వెళ్లిపోయే వరకూ సదరు కానిస్టేబుల్ పని పూర్తి కాదు!. తమ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ఫిర్యాదుదారులంటే ఒడుపుగా మాట్లాడి.. సీఐ గారు పరిష్కరిస్తారంటూ తీసుకెళ్లి..అక్కడ సినిమా చూపిస్తున్నారు.

ప్రతి పనికో రేటు..

రాజమండ్రి డివిజన్‌లోని హైవే పరిధి ఉన్న స్టేషన్లపై తీవ్రంగా ఆరోపణలు ఉన్నాయి. పేకాట బోర్డులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. హైవేను ఆనుకొని ఉన్న స్టేషన్ పరిధిలో 10 రోజుల కిందటి వర కూ బోర్డుల్లో పేకలు కళకళ లాడి లక్షలు చేతులు మారాయి. ప్రస్తుతం కొద్ది రోజులు ఎందుకనో రెస్ట్ ఇచ్చారు. హైవే పరిధి వచ్చే మరో స్టేషన్ పరిధిలో ప్రస్తుతం రెండు పెద్ద బోర్డులు నిర్వహిస్తున్నారని చెబు తున్నారు.ఈ స్టేషన్లకు లక్షల రూపాయల్లో ము డుపులు ముడుతున్నాయని సమాచారం. నాటు సారా కంపు కొండుతున్నా ఆ స్టేషన్లకు మాత్రం వాసన రావడం లేదు. కోడి పందేలు మామూలే. సిటీలోని లాడ్జిల్లో, గంటల ప్రాతిపదికన అద్దెకు ఇచ్చే ఫ్లాట్లలో, రిసార్టుల్లో యథేచ్ఛగా జూదంతో పాటు అన్ని వ్యవహారాలు నడుస్తున్నా ఆయా సీఐలకు ఉద్దేశపూర్వకంగానే కనిపించడం లేదని అంటున్నారు. ఇక రాత్రి వేళ హోటళ్లు బార్లా తెరిచి ఉంటున్నాయి. దీనికో రేటు. రాత్రి తెరిచి ఉంచితే ఇంతని బేరం కుదుర్చుకున్నట్టు సమా చారం. దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద హోటల్ దానికి ఉదాహరణ. ఈ హోటల్ 24 గంటలూ తెరిచే ఉంటుంది. ఎస్పీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్నా భయంలేదెందుకో మరి.

భయపెట్టి..సెటిల్‌మెంట్

ఒక సీఐపై గతంలో తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. అతను ఇప్పుడూ అదే పరిస్థితిలో ఉన్నాడు. ఓ పీఎస్ పరిధిలో తెలగపాముల వర్గానికి చెందిన ఓ వ్యక్తి ఇల్లు కొనుక్కుంటే.. అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందంటూ స్టేషనుకు పిలిపించుకుని నిలదీశారు. అతడిపై పెండింగ్ కేసులు ఉన్నాయని, ఎస్పీ, డీఎస్పీ గంజాయి కేసు పెట్టి జైలుకు పంపించమంటున్నారని బెదిరించి గత నెలలో ఒక రోజంతా స్టేషన్‌లో ఉంచారు. అతడి తల్లి వెళ్లి రూ.1.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నట్టు సమాచారం. అంతకు ముందు అదే సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తిని బెదిరించి ఆ వర్గంలో పెద్ద మనిషిగా చలామణీ అవుతున్న ఓ వ్యక్తి ద్వారా రూ.2 లక్షలకు సెటిల్ చేసుకున్నారని ఆరోపణలున్నాయి.ఈ క్రమంలో మెడికల్ లీవ్‌పై చెక్కేయడానికి సదరు సీఐ ఎత్తుగడ వేస్తున్నారని చెబుతున్నారు. మెడికల్ లీవ్‌పై వెళితే చార్జి మెమో వంటివి అందజేయడానికి, వీఆర్‌లో పెట్టడానికి వీలుండదు. తొలుతగా నాలుగు వారాలు ఆ తరహా సెలవు తీసుకొని పొడిగించుకునే వెసులుబాటు ఉంది. అంతా సర్దుబాటు చేసుకొనే వరకూ మెడికల్ లీవ్ పొడిగిస్తారనే విమర్శలున్నాయి.

నేడు డీడీవో కార్యాలయాలు వర్చువల్‌గా ప్రారంభం

దివాన్‌చెరువు/కొవ్వూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాలను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని డివిజనల్ అధికారులు పి.వీణాదేవి, ఎ.శ్రీవారెడ్డి బుధవారం తెలిపారు. ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న డీడీవో కార్యాలయాన్ని లాలాచెరువు హౌసింగ్‌బోర్డులోని పాత గ్రామ పంచాయతీ భవనంలో, కొవ్వూరు మెయిన్‌రోడ్‌లోని పంచాయతీ రాజ్ అతిథిగృహం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యాలయాలను గురువారం ఉదయం ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 76 రెవెన్యూ డివిజన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన అన్ని డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన వద్దు
డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగిన చికిత్స అందుబాటులో ఉన్నందున ప్రజలు నిర్భయంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్నాయన్నారు. వ్యాధికారక కీటకం కుట్టిన ప్రదేశంలో ఎర్రటిమచ్చ కనిపిస్తుందన్నారు. పొలాలు, తోటలు, గుబురు చెట్లు ఉన్న ప్రదేశాలకు వెళ్లేవారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. జ్వరం లేదా అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్యకేంద్రాలను సంప్రదించాలన్నారు.





వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి

కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

» ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ » కాకినాడ జేఎన్టీయూలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు

జేఎన్టీయూకే, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, వారి కోసం మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. కాకినాడ జేఎన్టీయూలోని అలూమ్ని ఆడిటోరియంలో బుధవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుక నిర్వహించారు. సంక్షేమ శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. 2028లో జరిగే పారా ఒలింపిక్స్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి విభిన్న ప్రతిభావంతులు ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తామన్నారు. ట్రైనీ కలెక్టర్ మనీషా మాట్లాడుతూ సామాజిక పురోగతిని పెంపొందించడం కోసం అంగవైకల్యంతో కూడిన సమాజాలను ప్రోత్సహించడం అనే ఇతివృత్తంతో 2025 ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం రెండు వసతిగృహాలు నిర్వహిస్తుండగా వాటిలో 200 మంది బాల, బాలికలు వసతి పొందుతున్నారని తెలిపారు. దృష్టి లోపం ఉన్న వారికి ఒక ఆశ్రమం నిర్వహిస్తుండగా 100 మంది మహిళలు, పురుషులు వసతి పొందుతున్నారన్నారు. ఇప్పటికే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి వివిధ పరికరాలు అందించేందుకు 1,891 మందిని గుర్తించామన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అతిథులు అందజేశారు. విభిన్న ప్రతిభావంతులకు ఉత్తమ సేవలందిస్తున్న 15 సంఘాల ప్రతినిధులకు, ప్రత్యేక పాఠశాలల ఉపాధ్యాయులు 26 మందికి, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా నిర్వహిస్తున్న ప్రత్యేక పాఠశాలల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జేఎన్టీయూకే రెక్టార్ సుబ్బారావు, మహర్షి సాంబమూర్తి ప్రత్యేక పాఠశాల, ఉమా మనోవికాస కేంద్రం, సిరి ప్రత్యేక పాఠశాల, శాంతివర్ధన ప్రత్యేక పాఠశాల, ప్రభుత్వ బధిర ఉన్నత పాఠశాల, కన్నా ఆశ్రయ్ మానసిక పాఠశాల, విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ప్రతినిధులు ఎం.పాపిరెడ్డి, బి.కిరణ్, జి.కొండలరావు, ఎన్.సురేష్, కేఎస్ సుబ్రహ్మణ్యం, అంధ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్, జవహర్, సిరి పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా



సినిమా పాటకు డ్యాన్స్ చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

విశాఖ-తిరుపతి మధ్య ఎనిమిది ప్రత్యేక రైళ్లు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ-తిరుపతి-విశాఖ మధ్య ఎనిమిది ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను జనవరి 13 వరకు నడుపుతున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సామర్లకోట మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు డిసెంబరు 30 వరకూ ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారులకు అందించిన సమాచారంలో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారుల నుంచి ఆంధ్రజ్యోతి సేకరించిన సమాచారం ఇలా ఉంది.

● 08583 నంబరు గల విశాఖ-తిరుపతి మధ్య డిసెంబరు 29 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతికి చేరుతుంది. ఈ ప్రత్యేక రైలు డిసెంబరు 8,15,22,29 తేదీల్లో 4 ట్రిప్‌లుగా నడువనుంది.

విశాఖ నుంచి అన్నవరానికి రాత్రి 8.40 గంటలకు చేరుకుంటుంది. సామర్లకోటకు రాత్రి 9.05 గంటలకు, రాజమహేంద్రవరం నకు రాత్రి 9.55 గంటలకు, నిడదవోలుకు రాత్రి 10.22 గంటలకు చేరుకుని తణుకు, భీమవరం.ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయ వాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుతుంది.

● 08584 నంబరు గల తిరుపతి-విశాఖ మధ్య డిసెంబరు 30 వరకూ ప్రతీ మంగళవారాల్లో బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 4 ట్రిప్‌లుగా నడువనుంది.

ఈ రైలు డిసెంబరు 9,16,23,30 తేదీల్లో 4 ట్రిప్‌లుగా నడువనుంది.

తిరుపతిలో ఈ రైలు మంగళవారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖకు చేరుతుంది.

నిడదవోలుకు ఉదయం 6.15 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరం నకు ఉదయం 6.43 గంటలకు చేరుకుని సామర్లకోటకు ఉదయం 7.28 గంటలకు, అన్నవరం నకు ఉదయం 7.53 గంటలకు చేరుకుని విశాఖకు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుతుంది.

ఈ వారానికి ఒక్కరోజు నడిచే ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కట్లు కోసం సమీప రైల్వే స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ ప్రత్యేక రైలులో 2వ తరగతి ఏసీ, మూడవతరగతి ఏసీ, ఎకానమీ మూడవ తరగతి ఏసీ, స్లీపర్, ఆరు జనరల్ బోగీలు, నాలుగు ఎస్ఎల్ఆర్‌డీ, ఒకటి ఈవోజీలతో కలిపి 21 ఎల్‌హెచ్‌బీ బోగీలతో రాకపోకలు సాగిస్తుంది.

22న నన్నయలో

జాతీయ సెమినార్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

దివాన్‌చెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈనెల 22న భారతీయ జ్ఞాన వ్యవస్థలను తిరిగి పొందడం, ముందుకు సాగే మార్గం అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలోని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విద్యాభారతి ఉచ్చా శిక్షా సంస్థాన్(వీబీయుఎస్ఎస్) సహకారంతో రిక్లైమింగ్ ఇండియన్ నాలెడ్జిసిస్టమ్స్ ఫార్వర్డ్ అనే అంశంపై జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వర్సిటీ, అనుబంధ కళాశాలలు, యుజీ, పీజీ స్థాయిలో పాఠ్యాంశాలనుఅనుసరించడం ద్వారా భారతీయ జ్ఞాన వ్యవస్థల గురించి ప్రాథమిక జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం తదనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టడం ఈసెమినార్ లక్ష్యమన్నారు. సెమినార్ కన్వీనర్లుగా ఆచార్య కె.ఎస్.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్.సజ్జారాజ్ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, సెమినార్ కన్వీనర్లు ఆచార్య కె.ఎస్.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్.సజ్జారాజ్ పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పొల్లూరులో హీరో రవితేజ సందడి

మోతుగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధి పొల్లూరులో రవితేజ హీరోగా నటిస్తున్న నూతన సినిమా చిత్రీకరణ బుధవారం మోతుగూడెం పరిసర ప్రాంతంలో ప్రారంభమైంది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శివ దర్శకత్వం వహిస్తున్నారు. పొల్లూరు శివాలయం వీధులు ఎగువ, దిగువ జలపాతాలు, సీలేరు నది పరీవాహక ప్రాంతాలు, ఫోర్ బై పిక్నిక్, జలాశయాలు వద్ద మరి కొన్ని సన్నివేశాలను చిత్రీ కరించనున్నారు. దీంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రవితేజ అభిమానులు తరలివచ్చారు.



చిన్నారులతో హీరో రవితేజ

‘చేనేత’కు ఎన్నికలు నిర్వహించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని చేనేత కులాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ పంపన రామకృష్ణ కోరారు. బుధవారం కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత సంక్షోభం వల్ల చేతినిండా పని లేక చేనేత కార్మిక కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. చేనేత పాలక వర్గాల పదవీకాలం 13 సంవత్సరాల క్రితం ముగియగా ఇప్పటివరకు ఎన్నికలు జరపలేదన్నారు. దీంతో పర్సన్ ఇన్‌చార్జీల పాలనలో నడుస్తున్నాయన్నారు. దీనివల్ల సొసైటీల అభివృద్ధి కుంటుపడిందన్నారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే సొసైటీల ద్వారా వస్త్రాల అమ్మకాలపై 30 శాతం రిబేటు అమలు చేయాలన్నారు. చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు అన్ని రకాల పథకాలు అమలు చేయాలన్నారు. కార్మికులకు ఉచిత విద్యుత్ అందించడం అభినందనీయమన్నారు. సమావేశంలో నాయకులు సూర్యచంద్రరావు, కె. రామారావు, పి. వెంకటరమణ, కె.సతీష్, పి. వెంకటేశ్వరరావు, పి. శ్రీనివాసులు, ఎస్. వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని

వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన లక్ష్మణ్‌రెడ్డి, గాయపడిన రవీంద్ర

రంపచోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బందపల్లి గ్రామానికి చెందిన సోముల లక్ష్మణరెడ్డి, విండెల రవీంద్ర రంపచోడవరం నుంచి బందపల్లికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పీఎంఆర్‌సీ సమీపంలో పవర్ స్టేషన్ వద్ద రంపచోడవరం నుంచి గోకవరం వెళ్తున్న ఆర్టీసీ బస్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. సోముల లక్ష్మణ్‌రెడ్డి(25) అక్కడికక్కడే మృతిచెందగా రవీంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. అతడికి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి కేసులో ఇద్దరి అరెస్ట్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వ్యక్తి మరణించిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులను పిఠాపురం సీఐ శ్రీనివాస్ బుధవారం అరెస్టు చేశారు. తాటిపర్తిలో తేరాటి ప్రసాద్ కూతురు పుట్టిన రోజు సందర్భంగా గత నెల 27వ తేదీ రాత్రి రోడ్డుపై వంటలు చేశారు. అదే దారిలో వచ్చిన వెంపాల సూరిబాబు పెద్ద కోడలు కృష్ణవేణికి అడ్డం పెట్టి బల్ల తగిలి పడిపోయింది. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో సూరిబాబును తోయగా పడిపోవడంతో గాయపడి మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసిన గొల్లప్రోలు పోలీసులు సూరిబాబు మృతికి కారకులైన తేరాటి ప్రసాద్, శ్రీమంతుల ఏసుదయను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్టుసీఐ,ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

శీలా వీర్రాజు పుస్తకాలు

తెలుగు యూనివర్శిటీకి అపూర్వ నిధి

పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



యార్లగడ్డ, వీసీ మునిరత్నం నాయుడికి పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శీలా వీర్రాజు సేకరించిన పుస్తకాల ద్వారా తెలుగు విశ్వవిద్యాలయానికి ఒక అపూర్వ నిధి అందిందని పద్మశ్రీ, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీపీ బ్రౌన్ మందిరం, మాదేటీ రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శీలా వీర్రాజు సేకరించిన జాతీయ, అంతర్జాతీయ చిత్రకళా పుస్తకాలను ఆచార్య యార్లగడ్డ, తెలుగు యూనివర్శిటీ వీసీ ఆచార్య డి.మునిరత్నంలకు దామెర్ల ఆర్ట్ గ్యాలరీలలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రాణహిత కవి సన్నిధానం నరసింహశర్మ అధ్యక్షతన జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ ఎన్టీఆర్ మానసిక పుత్రిక అయిన తెలుగు విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఎన్టీఆర్ పుత్రిక అయిన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, విద్యాశాఖ మంత్రి లోకేశ్ సహకరిస్తారనే విశ్వాసం తనకు ఉందన్నారు. తెలుగు యూనివర్శిటీ అభివృద్ధి రాజమహేంద్రవరం ప్రజల బాధ్యత అన్నారు. తెలంగాణ నుంచి చేరాల్సిన చర స్థిరాస్తుల విషయంలో రెండు వర్సిటీల ఉపకులపతులు ఒక నిర్ణయానికి రావాలని యార్లగడ్డ కోరారు. వీసీ మునిరత్నం నాయుడు మాట్లాడుతూ శీలా వీర్రాజును తాను గతంలో కలిశానని, ఆయన సేకరించిన పుస్తకాలు తమకు బహూకరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు మాదేటి రవిప్రకాష్, ఆంధ్ర యూనిర్శిటీ రిటైర్డ్ ఆచార్యులు డాక్టర్ పర్వతనేని సుబ్బారావు, భగీరధి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌వీఎస్ఎస్ లక్ష్మి, సన్నిధానం శాస్త్రి, మల్లాది శ్రీరామ్, ఇన్‌కంట్యాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ మేడిశెట్టి తిరుమల కుమార్, విశ్రాంత మేజిస్ట్రేట్ ఎస్ఆర్ పృథ్వీ, సామాజిక వేత్త కె.సుర్యకుమారి, అమ్మభగవాన్ సేవకులు మంతెన రాధిక తదితరులు పాల్గొన్నారు.

బాలికపై మేనమామ అత్యాచారం

పోక్సో కేసు నమోదు

పిఠాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తన కళ్లెదుటే పెరిగిన బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలో ఈ సంఘటన జరిగింది. మండలంలో ఓ గ్రామానికి చెందిన పదో తరగతి చదుతున్న బాలికను ఆమె తల్లి నవంబరు 7వ తేదీ రాత్రి 7-8గంటల సమయంలో సమీపంలోనే ఉన్న మేనమామ ఇంటికి వెళ్లి పాలు తీసుకురమ్మని చెప్పింది. దీంతో బాలిక మేనమామ ఇంటికి వెళ్లింది. పాల గిన్నె కనిపించడం లేదని చెప్పి బాలికను లోపలికి రమ్మన్నాడు. తర్వాత తలుపులు వేసి బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎంతకు బాలిక రాకపోవడంతో తండ్రి అక్కడికి వచ్చి తలుపులు కొట్టాడు. తలుపులు తీసిన మేనమామ (30) అక్కడ నుంచి పరారయ్యాడు. పెద్దల్లో విషయాన్ని పెట్టినా ఫలితం లేకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసుకు ఫిర్యాదు చేయగా బుధవారం పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచారానికి పాల్పడ్డ బాలిక మేనమామకు ఇప్పటికే వివాహమై పిల్లలు ఉన్నారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

5,300 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

జగ్గంపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో విజిలెన్స్, సివిల్ సప్లై ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. జగ్గంపేట సివిల్ సప్లై అధికారి కృష్ణ అందించిన వివరాల ప్రకారం.. గోరింట గ్రామానికి చెందిన కోరుకొండ అచ్యుతరావు ఏపీ 39యువై 5549 వాహనంలో రేషన్ బియ్యాన్ని ఇర్రిపాక మీదుగా తరలిస్తున్నట్టు గుర్తించి పట్టుకున్నారు. బియ్యాన్ని ఎంఎస్‌వో పాయింట్ కాటా వద్ద కాటా వేయగా 5,300 కిలోల వచ్చింది. వ్యాన్ డ్రైవర్ అచ్యుతరావు, వ్యాన్ యజమాని గనిశెట్టి రాజు, రైస్ యజమాని మన్యం తేజపై 1955 సెక్షన్‌కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు. రైస్ విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో విజి లెన్స్ సీఐ టి.గోపాలకృష్ణ, ఎంఎస్‌వో జీఎం కృష్ణ సిబ్బంది ఉన్నారు.

8న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్టు కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రధానాధికారి, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.ముర్తి బుధవారం తెలిపారు. కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్మెంట్, స్టాఫ్ వచ్చి ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జెరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440408182లో సంప్రదించాలని కోరారు.

ఫేక్ ఇన్‌స్టాగ్రామ్..

అసభ్యకర పోస్టు

కేసు నమోదు

తాళ్లరేవు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పాతకోరింగ గ్రామానికి చెందిన ఒక మహిళ పేరిట గుర్తు తెలియని వ్యక్తి ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ క్రియేట్ చేసి అసభ్యకర ఫొటో పోస్టు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు కోరింగ ఎస్ఐ పి. సత్యనారాయణ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. గతనెల 27న బాధిత మహిళ స్నేహితుల ద్వారా విషయం తెలుసుకుంది. ఫేక్ ఐడీ క్రియేట్ చేసిన వ్యక్తిని ఎవరు నువ్వు ఎందుకిలా చేస్తున్నావని ఆమె మెసేజ్ ద్వారా అడిగింది. సదరు వ్యక్తి పాతకోరింగ గ్రామానికి చెందిన పోతుల వినోద్ అలియాస్ అర్జున్ భార్య ద్వారా మీ వివరాలు తెలుసుకున్నానని చెప్పాడు. దీంతో సదరు మహిళ తనకు అవమానము కలిగినందుకు కోరింగ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో

అంగన్వాడీ కార్యకర్త మృతి



భారతి(ఫైల్)

ఉప్పలగుప్తం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం సెక్టార్ పరిధిలోని రాఘవులపేట అంగన్వాడీ కేంద్రం కార్యకర్త, నంగవరానికి చెందిన బొంతు భారతి(42) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందినట్టు సంఘ ప్రతినిధి కె.బేబీగంగారత్నం పేర్కొన్నారు.

మురమళ్ళ వీరేశ్వరుడి ఆదాయం

రూ.9.96 లక్షలు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు

ఐ.పోలవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.9,96,203 ఆదాయం వచ్చిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు సమక్షంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో బుధవారం స్వామి హుండీలను లెక్కించారు. గత 45రోజులకు ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.9,87,354, అన్నదానం హుండీ ద్వారా రూ.8,849... 5 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్టు తెలిపారు. హుండీల ఆదాయాన్ని దేవస్థానం బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నట్టు తెలిపారు. తొలుత ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ, బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ హుండీలకు హారతి ఇచ్చి ప్రారంభించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు తదితరులున్నారు.

అంతర్వేదిలో హైకోర్టు జడ్జి పూజలు



జడ్జికి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అంతర్వేది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హైకోర్టు జస్టిస్ వి.గోపాలకృష్ణారావు బుధవారం కుటుంబసమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో దర్శనం నిర్వహింపచేసి వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

గ్రామ సంఘాలు పారదర్శకంగా ఉండాలి

డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ సంఘాలు డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు, తిరిగి చెల్లింపులు, పుస్తక నిర్వహణ, సమావేశాల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రచారం చేయడంలోనూ అత్యంత పారదర్శకతతో ఉండాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట టీటీడీసీ ఆవరణలో కొత్తగా మోడల్ మండలాలుగా ఎంపికైన సామర్లకోట, జగ్గంపేట, గొల్లప్రోలు, కాజులూరు, కరప మండలాల సిబ్బందితో పేదరిక నిర్మూలనలో భాగంగా విజన్ బిల్డింగ్ మాడ్యూల్ 1,2,3లపై ఎంసీఎల్ఎఫ్ఎస్, సీఎల్ఎఫ్‌లస్థాయి అవగాహనా సమావేశం బుధవారం సామర్లకోట ఏపీఎం జగదీశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీడీ శ్రీనివాసరావు పలు అంశాలను వివరించారు. డీపీఎం భరత్, ఐబీ ఏపీఎం ఇందిరా అన్ని క్లస్టర్ల ఎల్‌సీలు, సీసీఎస్‌లు పాల్గొన్నారు.



సామర్లకోటలో ప్రసంగిస్తున్న పీడీ శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి


బిక్కవోలులో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్, రాజానగరంలో దివ్యాంగులకు బిస్కెట్లు అందజేస్తున్న దృశ్యం

దివ్యాంగుల పట్ల వివక్ష చూపరాదు

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి
● ఘనంగా జాతీయ దివ్యాంగుల దినోత్సవం

రాజమహేంద్రవరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులపట్ల వివక్ష చూపరాదని, ప్రతి ఒక్కరూ దయ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీపేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆమె పలుకు స్కూల్ ఫర్ డెఫ్, జియోన్ అంధుల పాఠశాలను సందర్శించారు. అంధులు వినియోగించే చేతి కర్రలను అందజేశారు. వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. న్యాయ సహాయం అవసరమైతే 15100 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని, డీఎల్ఎస్ఏని కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

దివ్యాంగులు ఉత్తమ భవిష్యత్ సాధించాలి

రాజమహేంద్రవరంఅర్బన్(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు మానసికంగా బలంగా ఉంటూ ఉత్తమ భవిష్యత్తు అందుకోవాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే అన్నారు. బుధవారం కళాశాలలో ప్రపంచ దివ్యాంగుల డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో చదువుతున్న దివ్యాంగులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అంధ ఎంప్లాయిస్ అసోసియేషన్ మహిళా సెక్రటరీ సీతభాయ్, ఐడీబీఐ తణుకుశాఖ మేనేజర్ కె.నాగేంద్ర, దివ్యాంగ కమిటీ కన్వీనర్ రామమూర్తి పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రాజానగరం(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసం భవిత కేంద్రాల్లో ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్‌లు పిలుపునిచ్చారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజానగరంలోని ఎంపీపీ స్కూల్-1 భవితలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనలక్ష్మి, బేగం, సురేష్, ఇందిరాగాంధీ, ఎస్ఎంసీ ఛైర్మన్ పాల్గొన్నారు.

చిన్నారులు దైవ సమానులు: ఎంఈవో

రంగంపేట(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన చిన్నారులు దైవ సమానులని వారిని ప్రేమతో సాకటంతో తల్లిదండ్రులు చైతన్యవంతులు కావాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు కోరారు. ప్రధానోపాధ్యాయుడు పి.సూర్యకృష్ణ అధ్యక్షతన ఐ.ఇ.ఆర్.టి.ఎం.వీ.ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చెవిటి, మూగ వైకల్యంతో ఈ కేంద్రంలో చదివిన మణికంఠ అనే విద్యార్థిని పదవ తరగతి, ఇంటర్, డీఈడీ కోర్సు చదివించి, ఈ ఏడాది నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం రావడానికి కృషిచేసిన ఐఆర్టీలు ప్రసాద్,అంజలీల కృషిని మండల విద్యాశాఖాధికారి-2 పి.మధుసూదనరావు అభినందించారు. కార్యక్రమంలో సి.ఆర్.ఎం.టి. ఎల్.శ్రీనివాసరాజు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బిక్కవోలు(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని బిక్కవోలు ఎంపీడీవో వి.శ్రీనివాస్ సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ భవిత కేంద్రంలోని 24 మందికి ఎంఆర్ కిట్లు, ఇద్దరికి రోలేటర్స్, ఇద్దరికి వీల్‌చైర్లు, ఏడుగురికి ట్రాన్స్‌పోర్ట్, ఎనిమిది మందికి ఎస్కార్ట్, ఏడుగురికి స్టైపండ్, పది మందికి హోంబేస్డ్ అలవెన్సులు జమయ్యాయని తెలిపారు. కూటమి నేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, త్రిమూర్తులు, ఏవో నాగేంద్రప్రసాద్, ఐఈఆర్టీలు సన్యాసిరావు, సత్య, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ఆదరాభిమానాలు ఉండాలి

గోకవరం(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులపట్ల ప్రతీ ఒక్కరూ ఆదరాభిమానాలు కలిగి ఉండాలని జిల్లా మానవహక్కుల ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ అన్నారు. గోకవరంలోని భవిత సెంటర్‌లో బుధవారం నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగ పిల్లలకు గోకవరం గ్రామానికి చెందిన నక్కా రామరాజు ఆహారాన్ని సమకూర్చగా, నాగులకొండ బుజ్జి, కంచర్ల పెద్ద అప్పారావు రగ్గులు,బిస్కెట్లు, డ్రింక్‌లు అంద జేశారు.

ధవళేశ్వరం(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల గల పిల్లల విద్యా వనరుల కేంద్రం భవిత సెంటర్‌లో బుధవారం అంతర్జాతీయదివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రూరల్ మండల విద్యాశాఖాధికారి తులసిదాస్, కిరణ్ చందు హాజరుకాగా కూటమి నాయకులు పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు సావాడ శ్రీనివాసరెడ్డి టీచర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండూరి అప్పారావు, ఆళ్ళ ఆనందరావు, ఒంటెద్దుస్వామి, యడ్ల మహేష్, ఐఈఆర్టీ టీచర్లు ఎ.వెంకటలక్ష్మి, విశ్వపతి, మణి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో మెలగాలి

కడియం (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో మెలగుతూ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని కడియం ఉపసర్పంచ్, సొసైటీ చైర్‌పర్సన్ వెలుగుబంటి నాని పేర్కొన్నారు. బుధవారం కడియం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెలుగుబంటి నాని మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు టీడీపీ అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ఎంఈవో మణికుమార్, చిలుకూరి ప్రభాకర్, భవిత ఉపాధ్యాయులు నాగిరెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శివాలయం సమీపంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి టి.కుశలవదొర, 2వ ఎంఈవోసుజాత, గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ వీరగణేష్, మండల పోలీస్ అధికారి సత్యకిషోర్ పాల్గొనారు. సమావేశంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు


చంద్రబాబుతో ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి, టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి

రాజమహేంద్రవరంరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలో జరిగిన రైతన్నా మీకోసం ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం చంద్రబాబును రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మర్యాదపూర్వంగా కలిశారు. ఈసందర్భంగా గోరంట్లను సీఎం చంద్రబాబు పలుకరించారు. అభివృద్ధి కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు.

రాజమహేంద్రవరంసిటీ(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కలిశారు. బుధవారం నల్లజర్ల వద్ద జరిగిన సభలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు విచ్చేసిన సమయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సీఎంను కలిశారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయమై చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

అనపర్తి(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి బుదవారం నల్లజర్ల హెలీప్యాడ్ వద్ద ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనపర్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితులపై మనోజ్‌రెడ్డిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాల్సిందిగా మనోజ్‌కు చంద్రబాబు సూచించినట్లు మనోజ్‌రెడ్డి తెలిపారు.


మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు

ఎస్కేవీటీలో విద్యార్థుల మాక్ పార్లమెంట్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పార్లమెంట్ వ్యవస్థ, రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో బుధవారం రాజమహేంద్రవరంలోని ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. రాజ్యసభ, లోక్‌సభ రెండు బృందాలుగా విద్యార్థులతో ఏర్పాటుచేశారు. రాష్ట్రపతి, స్పీకర్, కేంద్రమంత్రులు, ప్రతిపక్ష నేతలు, ఎంపీలుగా విద్యార్థులు చక్కని వాదోపవాదాలతో చర్చలు సాగించా రు. గంటన్నరపాటు ప్రశ్నోత్తరాల సమయం కొనసాగింది. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం దీన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.నూకరాజు, జి.హరికృష్ణ, పీవీబీ సంజీవరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్

రాజానగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరుగుతుందని మండల విద్యాశాఖాధికారులు ఎం.రామన్నదొర, జ్యోతి ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు పాల్గొనే విధంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు చూడాలన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన


రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 40వ డివిజన్‌లో రూ.10లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రజలు నివసించే ప్రాంతాలలో అభివృద్ధి చేయడమే అసలైన అ భివృద్ధి అని అన్నారు. 40వ డివిజన్‌లో సుమా రు 15 ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు. రామయ్యదిబ్బప్రాంతంలో రోడ్డు, డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆ సమస్యకు పరిష్కారం చూపించామన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కేవలం జెఎన్ రోడ్డు, ఏవీ అప్పారావురోడ్డు ఇలా ప్రధాన రోడ్లు మాత్రమే చూసుకుని పనులు చేశారని, కానీ చిన్న చిన్నరోడ్లు పట్టించుకోకపోవడంవల్ల ప్రజలు ప్రస్తుతం ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆయుష్మాన్ భారత్ పరిధి విస్తరించాలి

● పార్లమెంట్‌లో ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరంఅర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ పరిధిని విస్తరించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అండర్‌రూల్ 377 ముఖ్యమైన అంశంగా ఈ విషయంపై ఎంపీ మాట్లాడుతూ ఈ పథకం కింద కుటుంబానికి రూ.5లక్షల ఆరోగ్యరక్షణను అందించడం ద్వారా ఇది దేశవ్యాప్తంగా 12 కోట్లకుపైగా ఆర్థికంగా బలహీనవర్గాలవారి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. ఈ పథకం విశేష ఫలితాలను అందించినా కొన్ని కీలక లోటుపాట్లు లబ్ధిదారులను ఇప్పటికీ భారంగా మారాయని తెలిపారు. సాధారణ ఓపీడీ సేవలు పథకం పరిధిలో లేకపోవడం, ప్రస్తుతం 15 రోజులకే పరిమితమై, ఆసుపత్రి అనంతర ఔషధాలు అందుబాటులో లేకపోవడంతో లబ్ధిదారులకు సొంత ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో పలు చర్యలను తక్షణమే అమలు చేయాలని కోరారు. దీర్ఘకాలిక, సాధారణ వ్యాధుల కోసం అవసరమైన ఓపీడీ సేవలను పథకం పరిధిలో చేర్చడం, ఆసుపత్రి అనంతర ఔషధాల కవరేజీ 15 రోజుల పరిమితిని దాటి మరింత కాలానికి విస్తరించడం, లబ్ధిదారులపై పడుతున్న ఖర్చులను తగ్గించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

బూరుగుపూడిలో రైతన్న మీ కోసం కార్యక్రమం


బూరుగుపూడి రైతు సేవా కేంద్రం వద్ద రైతన్నమీ కోసం లైవ్ స్ట్రీమింగ్ కార్యక్రమం దృశ్యం

కోరుకొండ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బల రామకృష్ణ సూచనల మేరకు కోరుకొండ మండలం బూరుగుపూడిలో రైతు సేవా కేంద్రంవద్ద బుధవారం సాయంత్రం లైవ్ స్ట్రీమింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులతో ఉన్న ప్రత్యక్ష బంధాన్ని పెంపొందించడానికి సీఎం చంద్రబాబు విజన్‌తో బలోపేతం చేసేందుకు బూరుగుపూడి రైతుసేవాకేంద్రంలోని రైతులతో నాయకులు వ్యక్తిగతంగా సంభాషించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పద్ధతుల్లో అనేక మెళకువలు తెలిపారు. పలువురు కూటమి నాయకులు, సొసైటీ అధ్యక్షుడు కంటే నాగేశరావు, జనసేన నాయకుడు డాక్టర్ అడపా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట సత్యనారాయణ, గణపతి, రైతు కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎస్‌వో సర్టిఫికెట్లు స్ఫూర్తితో పనిచేయాలి

● నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


ఐఎస్‌వో సర్టిఫికెట్లతో నన్నయ అధికార్లు, సిబ్బంది

దివాన్‌చెరువు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఐదు ఐ.ఎస్.ఓ. సర్టిఫికెట్లు రావడం చారిత్రక విజయమని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నతంగా పనిచేయాలని సూచించారు. ఐ.ఎస్.ఓ సర్టిఫికెట్లు సాధించిన సందర్భంగా బుధవారం విశ్వవిద్యాలయంలో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఐదు సర్టిఫికెట్లు విశ్వవిద్యాలయం మకుటంపై ఐదు నక్షత్రాలని అభివర్ణించారు. విశ్వవిద్యాలయం అధికారుల నుంచి క్రిందిస్థాయి సిబ్బంది వరకూ అందరి కృషి ఫలితంగానే ఇటువంటి విజయాలు సొంతం అవుతాయని తెలిపారు. ఆతరువాత ఐఎస్ఓ సర్టిఫికెట్లు సాధించిన సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ఐ.క్యూ.ఎ.సి. డైరెక్టర్ వి.పెర్సిస్, ఫ్యాకల్టీ అసోసియేట్ ఎస్.మురళీమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలలో కేఏఆర్ విద్యార్థుల ప్రతిభ


అనపర్తిలో విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న హెచ్ఎం సుజాత

సీహెచ్ఎంకు మూడో స్థానం

రాజమహేంద్రవరం సిటీ.(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో జరిగిన ధీరుబాయ్ అంబానీక్విజ్ పోటీలలో సిటీ మున్సిపల్ హైస్కూల్ ఎనిమిదోవ తరగతి విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారని స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం ఎన్.గౌరీశంకర్ తెలిపారు. విద్యార్థులు శామ్యూల్, ప్రవీణ్, రష్మికలు జిల్లాలో తృతీయస్థానంలో నిలిచారు. వారికి డీఈవో కె.వాసుదేవరావు సైకిళ్లను బహుమతులుగా అందజేశారు.

అనపర్తి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ సంస్థ రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో అనపర్తిలోని కర్రి అప్పారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు హెచ్ఎం సుజాత తెలిపా రు. క్విజ్ పోటీలలో 9వ తరగతి చదువుతున్న తమలంపూడి సిరిదేవి, 8వ తరగతి చదువుతున్న శ్రీనివాసరెడ్డిలు ప్రతిభ కనబరచి సైకిళ్లను బహుమతిగా గెలుచుకున్నారని ఆమె తెలిపారు. విద్యార్థులను గైడ్ ఉపాధ్యాయుడు బంగారు నాయుడు, సత్తిరెడ్డి, హరిప్రసాద్, పద్మావతి, సూర్యసతీష్, శేషాయమ్మ, శ్రీలత అభినందించారు.


తృతీయస్థానంలో నిలిచి సైకిళ్లను కైవసం చేసుకున్న విద్యార్థులు

'మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి'

రాజానగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు ప్రజలంతా దూరంగా ఉండాలని తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీ ఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో గండేపల్లి శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. ఐఎస్‌టీఎస్ ఎన్ఎస్ ఎస్ యూనిట్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా బుధవారం తూర్పుగోనగూడెం, రాజానగరం, సూర్యారావుపేట గ్రామాల్లో సే నో టూ డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రేమాల్య, సాయి శ్రావణి, కావ్య, కమిటీ సభ్యులు కట్టా సౌజన్య పాల్గొన్నారు.

మానవాళికి వెలుగుచూపిన ఏసుక్రీస్తు

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


బిక్కవోలులో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న పాస్టర్లు

బిక్కవోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మానవాళికి వెలుగు చూపడానికి, రక్షించడానికి ఏసుక్రీస్తు అవతరించాడని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బిక్కవోలులో మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బు ధవారం నిర్వహించిన ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అతి తక్కువకాలం జీవించి మానవాళిపై ఎక్కువ ప్రభావం చూపిన వ్యక్తుల్లో ఏసుక్రీస్తు ఒకరన్నారు. కాలాన్ని గణించేటప్పుడు క్రీస్తు పూర్వం, క్రీస్తుశకం అని గణిస్తామని దీన్ని ప్రపంచ వ్యాప్తంగా పాటిస్తున్నారంటే క్రీస్తు అంత ప్రభావం చూసిన వ్యక్తి అని ఆయన తెలిపారు. ఈసందర్భంగా ముందస్తు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలను ఆయన అందరికీ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను పాస్టర్స్ ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పాస్టర్స్ అబ్రహాం, రాజ్‌కుమార్, ఎవ ర్నెస్ట్‌బాబు, సత్యానందం, వీర్రాజు, వరప్రసాద్, కూటమినేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి పాల్గొన్నారు.

ధవళేశ్వరం లయన్స్‌కైలాస భూమికి బెస్ట్ సర్వీస్ అవార్డు


అవార్డు అందుకున్న కైలాసభూమి కార్యదర్శి శేషుకుమార్

ధవళేశ్వరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):ధవళేశ్వరంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో అభివృద్ధిచేసి ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు కైలాస భూమిని 2024-25 సంవత్సరానికి బెస్ట్ రన్నింగ్ పర్మినెంట్ ప్రాజెక్టుగా గుర్తిస్తూ లయన్స్‌క్లబ్ అవార్డును ప్రదానం చేసింది. ఈ అవార్డును సామర్లకోటలో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్‌వైస్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌రాజ్ కైలాసభూమి కార్యదర్శి శేషుకుమార్ అందజేశారు.

శ్రీఅభయాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రంగంపేటలో శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలోశ్రీఅభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవిందు,కూటమి నాయకులు ఉండవిల్లి గిరిబాబు, గారపాటి రాంబాబు, బలిరెడ్డి దుర్గారావు, తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


దొరికిన బ్యాగ్‌ను పోలీసులకు అప్పగిస్తున్న ఆటోడ్రైవర్ అంజీరావు

సీతానగరం,డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి) సీతానగరం పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఆటోలో వెళుతుండగా రోడ్డుపై దొరికిన బ్యాగ్‌ను బుధవారంసీతానగరం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ధనుంజయ్‌కు అప్పగించి తన నిజాయితీని చాటాడు. సుమారు 10రోజుల క్రితం దొరికిన బ్యాగ్‌ను అందరికీ తెలయజేసినా ఎవ్వరూ బ్యాగ్ గురించి రాకపోవడంతో బుధవారం సీతానగరం పోలీసులకు అప్పగించారు. ఆ బ్యాగ్‌లో రెండు వెండి పట్టీలు, రూ. 150లు నగదు. ఉన్నాయి. పోలీసులు ఆటోడ్రైవర్ దాస్యం అంజీరావును అభినందించారు.

'సామాజిక సేవే విశ్వ మానవత లక్ష్యం'

బిక్కవోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో అత్యున్నత సేవలందించేందుకు విశ్వమానవత సంస్థ కృషి చేస్తుందని సంస్థ ఫౌండర్ అల్లూరి శ్రీనివాసచౌదరి తెలిపారు. బిక్కవోలులోని విశ్వ మానవత కేంద్రంలో బుధవారం యోగ, మంచి విషయాలపై అవగాహన సదస్సుతోపాటు ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రస్తుత తరుణంలో బాల్యదశలో పిల్లలకు సంస్కారవంతమైన విద్య అం దించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని శ్రీని వాసచౌదరి తెలిపారు. ఉచిత హోమియో వైద్య శిబిరంలో 100 మందికి పరీక్షలుచేసి మందులు అందజేశారు. బిక్కవోలు శాఖ అధ్యక్షుడు వల్లూరి రామచంద్రరావు, సంస్థ ప్రతినిధులు రాజేందర్, వీరభద్రవర్మ, భువనేశ్వరి, పావని, అరుణ, వెంకలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు రగ్గుల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం క్వారీ ప్రాంతం సుబ్బారావునగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రెండు కుటుంబాలకు రగ్గులను కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో వారు పడుతున్న బాధలు తెలుసుకున్నామని అందుకే రగ్గులు అందించామని వంటపాత్రలు కూడా కొని ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్-2 అధ్యక్షుడు బర్రే సుబ్రహ్మణ్యం, జిల్లా లేబర్‌సెల్ అధ్యక్షుడు దొంతుపల్లి రామ్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ దయ్యాలరాజు పాల్గొన్నారు.

మొదటి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్ జయంతి

రంగంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రంగంపేట ఆంజనేయస్వామి గుడి దగ్గర భారతదేశ ప్రథమపౌరుడు (మొదటి రాష్ట్రపతి) జయంతిని రాజకీయ విశ్లేషకుడు అడబాల మరిడయ్యకాపు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గెడ్డం చంద్రరావు, ఉండవిల్లి బులిసత్తిరాజు, తమ్మి వెంకట్రావు,ఉండవిల్లి సుబ్బారావు, గోపిన వెంకట్రావు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో రియల్‌ఎస్టేట్ కన్సల్టెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు స్థానిక చెరుకూరి తోటలో జరిగాయి. రాష్ట్రంలోనే తొలిసారిగా రియల్‌ఎస్టేట్ కన్సల్టెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఇక్కడ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షపదవికి నలుగురు, కార్యదర్శి కోశాధికారి పదవులకు ఇద్దరేసి చొప్పున పోటీ చేశారు. సుమా రు 1400మంది సభ్యులు ఈఎన్నికల్లో పాల్గొన్నారు. రియల్‌ఎస్టేట్ కన్సల్టెన్సీ రంగంలో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి నూ తన కార్యవర్గం కృషి చేస్తుందని అసోసియేషన్ నేత పిల్లి శ్రీనివాస్ చెప్పారు. సభ్యులు వీవీవీఎస్ శ్రీనివాస్, వల్లు రాజు, లక్ష్మణ్, పీబీ భూషణ్‌లు పర్యవేక్షించారు.

రేవులు శుభ్రం చేసిన ఎస్కేఆర్ విద్యార్థినులు


రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో క్లీనీనెస్ డ్రైవ్‌ను నిర్వహించారు. బుధవారం ఉదయం ఎన్‌సీసీ క్యాడెట్లు ఘాట్ పరిసరాలలో పేరుకుపోయిన ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను తొలగించి ప్రజాప్రదేశాల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి, ఎన్ సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రత్నంపేట ఏరియాలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమంలో బుధవారం వలంటీర్లు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్‌లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో దంటు వీరవెంకట్రావు, లక్ష్మీప్రవీణ, వలంటీర్లు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మం డలంలోని మల్లవరం 11కేవీ లోకల్ ఫీడర్‌ను ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా నూతన లైనువేసే నిమిత్తం పలు గ్రామాలకు నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బుధవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీటీ నటరాజన్ తెలిపారు. కొత్తపల్లి, కామరాజుపేట, సూదికొండ, గంగంపాలెం, ఠాకూరుపాలెం, జగన్నాధపురం, మల్లవ రం,భూపతిపాలెం, శివరామపట్నం, ఉమ్మెత్తు గ్రామాలకు విద్యుత్ సరఫ రా నిలిపివేస్తామన్నారు.





చంద్రబాబు అభివాదం





రైతన్నా- మీ కోసం

నల్లజర్ల రైతన్నా - మీ కోసం సభలో నులక మంచంపై కూర్చుని రైతుల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు చిత్రంలో మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మద్దిపాటి, కలెక్టర్ కీర్తి, బాపిరాజు

నేనున్నా!

అండగా ఉంటా..ఆదుకుంటా

- చెట్టు కింద.. నులక మంచంపై సీఎం సభ
- హంగూ ఆర్భాటం లేకుండా నిర్వహణ
- రైతుల సమస్యలు విన్నారు..
- సలహాలు స్వీకరించారు..
- మీరు చెప్పింది చేస్తా అంటూ భరోసా
- నల్లజర్లలో చంద్రబాబు సభ సక్సెస్

(రాజమహేంద్రవరం/నల్లజర్ల/గోపాలపురం/కొవ్వూరు/ దేవరపల్లి - ఆంధ్రజ్యోతి)

మీ సమస్యలు చెప్పండి.. వింటా.. పరిష్కరిస్తా.. అంటూ సీఎం చంద్రబాబు రైతులతో కలిసిపోయారు.. నల్లజర్లలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో సాధారణ నులక మంచంపై కూర్చుని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా సీఎం చంద్రబాబు చెట్టుకింద కూర్చుని రైతులు చెప్పింది ఆసక్తిగా విన్నారు.. సూచనలు.. సలహాలు స్వీకరించారు.. మీరు చెప్పింది నేను చేస్తా అంటూ వారి భరోసానిచ్చారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల జాతీయ రహదారికి సమీపాన బుధవారం జరిగిన రైతన్నా-మీకోసం కార్యక్రమం ఎవరూ ఊహించని విధంగా సభ ఏర్పాటు చేశారు. ఆరంభం నుంచి చివరి వరకూ వినూత్నంగా.. ఆసక్తిగా జరిగింది. ఉదయం 12 గంటలకు ఆరంభమైన చంద్రబాబు పర్యటన సాయంత్రం ఐదు గంటల వరకూ సాగింది. మొదట ఒక రైతు పొలంలో వేసిన వివిధ పంటలను సీఎం స్వయంగా పరిశీలించారు.ఒకేచోట వివిధ రకాల మొక్కలు పెంచడంపై ఆరా తీశారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఐదు స్టాల్స్‌ను తిలకించారు.ఆ స్టాల్స్‌లో వస్తువుల గురించి అధికారులు వివరించగా ఆయన విని.. వారిని అభినందించారు. రెండు గంటల సమయంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ పోతవరం రోడ్డు సమీపంలో ఓ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలతో సమీక్షించారు.తొలుత చంద్రబాబు భూగర్భజలాలు, పంటల మార్పిడి, ఆదాయం, యంత్రాల వినియోగం, లాభ సాటి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పంటల సాగు వంటి వాటి గురించి ప్రస్తావించారు. సభ ఏర్పాట్లు బాగా చేసినందుకు కలెక్టర్ కీర్తి చేకూరిని, నియోజకవర్గంలో బాగా పనిచేస్తున్నందుకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును అభినందించారు.కలెక్టర్ కీర్తి చంద్రబాబును సన్మానించారు.రోడ్ల పొడవునా కార్యకర్తలు బారులు తీరారు. పోలీసులు బందోబస్తు, భారీ భద్రత ఏర్పాట్లు చేశారు.గోపాలపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.320 కోట్ల ప్రణాళికను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సీఎంకు అందజేశారు. నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహ కిశోర్, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన నేత సువర్ణరాజు, మహిళా నేతలు స్వాగతం పలికారు.

రైతులకు అండగా : ఎమ్మెల్యే మద్దిపాటి



రైతుల ఆదాయం పెంచే విధంగా తమ ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకొచ్చి రైతు కుటుంబానికి అండగా ఉంటుం ది. 25 ఏళ్ల కిందట చంద్రబాబు ఇంకుడు గుంతలు తవ్వండి, చెక్ డ్యామ్‌లు కట్టండి అంటే ఎవరూ పెద్దగా పట్టించుకోలే దు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితిలో రైతులే ఇంకుడు గుంతలు కావాలంటున్నారు.. చంద్రబాబు విజన్ ఇలా ఉంటుంది. నదులను అనుసంధానం చేశారు. రైతుకు ఏది అవసరమో అది చేస్తారు.



ఎలా ఉన్నావయ్యా : ఎమ్మెల్యే నల్లమిల్లి, అనపర్తి ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డితో మాట్లాడుతున్న సీఎం

నేనూ వ్యవసాయం చేసేవాడిని..

నేను కూడా రైతు బిడ్డనే.. వ్యవసాయం చేసేవాడిని.. రైతు కష్టమేంటో తెలిసినవాడిని..అయితే రాజకీయాల్లోకి వచ్చా. ఇవాళ రైతులు చదువుకున్నవారు ఉన్నారని.. పీజీలు, పీహెచ్‌డీలు చేసినవారున్నారని.. అందరూ ప్యాంట్లు వేసుకుని వచ్చారని..మోడరన్ రైతులయ్యారని జోకులు వేయడంతో అందరూ నవ్వుకున్నారు. సభలో సీఎం చంద్రబాబు ఇద్దరు రైతులను తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. అందులో ఒకరు ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ నీలపాల నరసింహం కుడి వైపు కూర్చోగా, నల్లజర్లకు చెందిన గుదే అర్జునరావు ఎడమ వైపు కూర్చున్నారు.



వెల్‌కమ్ సార్ : సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిశోర్

అధిక శాతం మఫ్టీలోనే.. నిఘాకు ప్రాధాన్యం

విజిబుల్ పోలీస్.. ఇన్‌విజిబుల్ పోలీసింగ్.. ఇది సీఎం చంద్రబాబు పదే పదే పోలీసులకు చెప్పేమాట. ఆయన నల్లజర్ల పర్యటనకు జిల్లా పోలీసులు ఆ మాటను నిజం చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నరసింహ కిశోర్ 1300 మందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 12 సెక్టార్లుగా విభజించి నలుగురు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 63 మంది ఎస్‌ఐలు, మిగతా సిబ్బందిని నియమించారు. 7 స్పెషల్ పార్టీలు, 25 రోప్ పార్టీలు, 5 ఏరియా డీవోఎం పార్టీలను బందోబస్తులో భాగం చేశారు. ఈసారి సుమారు 60 శాతం మందికి యూనిఫాం వేయలేదు. మఫ్టీలోనే జనాల్లో తిరుగుతూ అనుమానులు గమనించారు. మహిళా పోలీసులను మఫ్టీలో మోహరించారు. కీలకమైన ప్రాంతాల్లోని కెమెరాలను డీజీపీ, నిఘా చీఫ్ కంట్రోల్‌కి అనుసంధానించారు. డ్రోన్ల ఫుటేజీలను నిరంతరం పరిశీలించారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఇద్దరు చొప్పున బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.





ఏంటివి : కొబ్బరి పీచుతో తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి దుర్గేష్



సభకు హాజరైన రైతులు

1.14 లక్షల మంది రైతు కుటుంబాలను కలిశాం : కలెక్టర్

నవంబరు 24 నుంచి 30వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లాలో లక్షా 14 వేల రైతు కుటుంబాలను కలిశాం. ఇంటింటికి వెళ్లి సీఎం సందేశ లేఖను అందించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ సాంకేతికత, విలువవృద్ధి, ప్రభుత్వ సమన్వయం అనే పంచసూత్రాల అమలుతో వ్యవసాయరంగం బలోపేతవుతుందని 'తూర్పు' జిల్లా కలెక్టర్ కీర్తి పేర్కొన్నారు.

ఆదర్శ రైతులకు సత్కారం





సీఎం సమక్షంలో ఆదర్శ రైతులు సింగరాజుపాలెం గ్రామానికి చెందిన దొండపాటి లక్ష్మీనారాయణ(బాబు), గుండుగొలనుగుంటకు చెందిన ఒబెలిశెట్టి గోపాలకృష్ణ, కురుకూరుకు చెందిన యెలమతి భాస్కరరావు, దుద్దుకూరుకు చెందిన కాకర్ల హరినాథ్, చిట్యాలకు చెందిన గద్దె హరిశ్చంద్రప్రసాద్, యర్నగూడెం గ్రామానికి చెందిన గద్దె మునేశ్వరరావు, వాదాలగుంటకు చెందిన గేద జోగేంద్ర ప్రసాద్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు.


నేడు గోదావరికి మహా నీరాజనం
తెలుగు వర్శిటీకి శీలా వీర్రాజు పుస్తకాలు
22న నన్నయలో జాతీయ సెమినార్
8



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కమిషనర్ రాహుల్ మీనా, చిత్రంలో ఎమ్మెల్యేలు వాసు, ముప్పిడి

కార్పొరేషన్‌కు అవార్డు.. సీఎం అభినందన

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ప్రతిష్టాత్మక జన్ భాగీరథీ 1.0 జాతీయ స్థాయి అవార్డు అందుకోవడం పట్ల సీఎం చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు. నల్లజర్లలో బుధవారం నిర్వహించిన రైతన్నా మీ కోసం సభకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు అవార్డు సర్టిఫికెట్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా చూపించారు.ప్రతిష్టాత్మక అవార్డు పట్ల వారిని సీఎం అభినందించారు.



ఇదేంటి బాస్!

అవినీతి అడ్డాలుగా పోలీస్ స్టేషన్లు

- ప్రతి స్టేషన్‌లో మామూలే
- లబోదిబోమంటున్న బాధితులు
- సీఐల రూటు.. సెపరేటు
- పేకాట బోర్డులు..సారాకు కొమ్ము
- అర్ధరాత్రి హోటళ్లకో రేటు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు స్టేషన్లపై ఆరోపణలు తీవ్రంగా వస్తున్నాయి.సామాన్యుల గోడు పట్టించుకునే వారే కరువయ్యారు. న్యాయం చేయండి మహాప్రభో అని వెళితే.. మా ఇంటి కొస్తే ఏం తెస్తారు.. మీ ఇంటికొస్తే ఏమిస్తారు అనే నానుడిని స్టేషన్‌లోని ఎవరి సామర్థ్యం కొద్దీ వారు నిజం చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ తీరు బాధితులను మరింత ఆవేదనకు గురి చేస్తోంది. జిల్లాలోని ఎస్పీ వద్ద అత్యంత కీలకమైన పోస్టులో ఎలాంటి ఆదేశాలు లేకుండానే విధులు నిర్వహిస్తున్న ఓ సీఐ పేరును ప్రస్తావిస్తూ ఓ మహిళ డీజీపీ కార్యాలయం వద్ద దుమ్మెత్తిపోశారు.ఒకసారి సస్పెన్షన్‌కి సైతం గురైనా జిల్లా స్థాయిలో కీలకమైన విధు లు అప్పగించ డంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఇదే సీఐ తీరుతో ఇప్పుడు జిల్లాలోని చాలా మంది సీఐలు లోలోపల కుమిలిపోతున్నారు.

రూ.15 వేలిస్తేనే.. బైక్ ఇస్తాం..

కొవ్వూరులోని ఓ రైతు తన ద్విచక్ర వాహనాన్ని మరమ్మతు నిమిత్తం మెకానిక్‌కి ఇవ్వగా మాయమైంది. రాత్రి ఒక యువకుడు బైక్ చోరీకి పాల్పడినట్టు సీసీ ఫుటేజీల ద్వారా తెలిసింది.ఆ బైక్ రాజమ హేంద్ర వరంలోని హైవే పక్కన ఉన్న ఓ స్టేషన్ పరిధిలో రోడ్డు పక్కన దొరికింది. పోలీసుల కూపీ లాగి బైక్ యజమా నికి ఫోన్ చేయగా స్టేషన్‌కు వచ్చాడు.రూ.15 వేలు ఇవ్వాలంటూ అతనితో స్టేషన్‌లో బేరం పెట్టారు. బాధి తుడు అంత ఇచ్చుకోలేనని చెబి తే.. 2015 మోడల్ కాబట్టి ఆ రేటు.. 2025 అయితే రూ.50వేలు కట్టాల్సిందేనంటూ గద్దించా రు. చివరికి కాళ్లావేళ్లా పడితే రూ.5వేలు స్టేషన్ తీసుకొని బైక్ అప్పగించారు.

అందని న్యాయం..


పోలీస్ స్టేషన్లలో చేయి తడిపితేనే పనవుతోంది. ఏ చిన్న పనిపై వెళ్లినా ఎంతో కొంత ముట్టచెప్పి రావాల్సిందే మరి..దీంతో చాలా మంది పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు.పోలీస్ స్టేషన్ స్థాయిలో సామాన్యులకు న్యాయం జరగడంలో జాప్యం జరుగు తోందనే అపవాదులు వినవస్తున్నాయి. పెద్ద కేసుకు ఒక తీరు, సామాన్యుడైతే మరో ప్రవర్తన కనిపిస్తోంది. పలు స్టేషన్ల వద్ద సాయంత్రం, రాత్రి వేళల్లో గుంపులు ఎందుకు కనిపిస్తున్నాయో ఇప్పటికీ సమాధానం దొరకని ప్రశ్నగానే ఉంది. ఎఫ్‌ఐఆర్‌లు వేయడానికి అర్ధరాత్రి ముహూర్తాలు అధికమైపోయాయి. ఇక తమ గోడును ఎస్పీకి వినిపిస్తేనే న్యాయం జరుగుతుందనే నమ్మకంతో అపసోపా లు పడి జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌కి బాధితులు క్యూ కడుతున్నారు.వీరిలో పేద మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా సీఐ సార్లు ఎస్పీ కార్యాలయంపై సైతం నిఘా పెడుతున్నారంటే ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. ఎస్పీ గ్రీవెన్స్ రోజున ఏదోక పనిపై స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌ని ఎస్పీ కార్యాలయానికి సీఐ పంపిస్తున్నారు. అక్కడ ఫిర్యాదుదారులంతా వెళ్లిపోయే వరకూ సదరు కానిస్టేబుల్ పని పూర్తి కాదు!. తమ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ఫిర్యాదుదారులంటే ఒడుపుగా మాట్లాడి.. సీఐ గారు పరిష్కరిస్తారంటూ తీసుకెళ్లి..అక్కడ సినిమా చూపిస్తున్నారు.

ప్రతి పనికో రేటు..

రాజమండ్రి డివిజన్‌లోని హైవే పరిధి ఉన్న స్టేషన్లపై తీవ్రంగా ఆరోపణలు ఉన్నాయి. పేకాట బోర్డులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. హైవేను ఆనుకొని ఉన్న స్టేషన్ పరిధిలో 10 రోజుల కిందటి వర కూ బోర్డుల్లో పేకలు కళకళ లాడి లక్షలు చేతులు మారాయి. ప్రస్తుతం కొద్ది రోజులు ఎందుకనో రెస్ట్ ఇచ్చారు. హైవే పరిధి వచ్చే మరో స్టేషన్ పరిధిలో ప్రస్తుతం రెండు పెద్ద బోర్డులు నిర్వహిస్తున్నారని చెబు తున్నారు.ఈ స్టేషన్లకు లక్షల రూపాయల్లో ము డుపులు ముడుతున్నాయని సమాచారం. నాటు సారా కంపు కొండుతున్నా ఆ స్టేషన్లకు మాత్రం వాసన రావడం లేదు. కోడి పందేలు మామూలే. సిటీలోని లాడ్జిల్లో, గంటల ప్రాతిపదికన అద్దెకు ఇచ్చే ఫ్లాట్లలో, రిసార్టుల్లో యథేచ్ఛగా జూదంతో పాటు అన్ని వ్యవహారాలు నడుస్తున్నా ఆయా సీఐలకు ఉద్దేశపూర్వకంగానే కనిపించడం లేదని అంటున్నారు. ఇక రాత్రి వేళ హోటళ్లు బార్లా తెరిచి ఉంటున్నాయి. దీనికో రేటు. రాత్రి తెరిచి ఉంచితే ఇంతని బేరం కుదుర్చుకున్నట్టు సమా చారం. దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద హోటల్ దానికి ఉదాహరణ. ఈ హోటల్ 24 గంటలూ తెరిచే ఉంటుంది. ఎస్పీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్నా భయంలేదెందుకో మరి.

భయపెట్టి..సెటిల్‌మెంట్

ఒక సీఐపై గతంలో తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. అతను ఇప్పుడూ అదే పరిస్థితిలో ఉన్నాడు. ఓ పీఎస్ పరిధిలో తెలగపాముల వర్గానికి చెందిన ఓ వ్యక్తి ఇల్లు కొనుక్కుంటే.. అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందంటూ స్టేషనుకు పిలిపించుకుని నిలదీశారు. అతడిపై పెండింగ్ కేసులు ఉన్నాయని, ఎస్పీ, డీఎస్పీ గంజాయి కేసు పెట్టి జైలుకు పంపించమంటున్నారని బెదిరించి గత నెలలో ఒక రోజంతా స్టేషన్‌లో ఉంచారు. అతడి తల్లి వెళ్లి రూ.1.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నట్టు సమాచారం. అంతకు ముందు అదే సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తిని బెదిరించి ఆ వర్గంలో పెద్ద మనిషిగా చలామణీ అవుతున్న ఓ వ్యక్తి ద్వారా రూ.2 లక్షలకు సెటిల్ చేసుకున్నారని ఆరోపణలున్నాయి.ఈ క్రమంలో మెడికల్ లీవ్‌పై చెక్కేయడానికి సదరు సీఐ ఎత్తుగడ వేస్తున్నారని చెబుతున్నారు. మెడికల్ లీవ్‌పై వెళితే చార్జి మెమో వంటివి అందజేయడానికి, వీఆర్‌లో పెట్టడానికి వీలుండదు. తొలుతగా నాలుగు వారాలు ఆ తరహా సెలవు తీసుకొని పొడిగించుకునే వెసులుబాటు ఉంది. అంతా సర్దుబాటు చేసుకొనే వరకూ మెడికల్ లీవ్ పాచిక పారిస్తారనే విమర్శలున్నాయి.



నేడు డీడీవో కార్యాలయాలు వర్చువల్‌గా ప్రారంభం

దివాన్‌చెరువు/కొవ్వూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాలను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని డివిజనల్ అధికారులు పి.వీణాదేవి, ఎ.స్లీవారెడ్డి బుధవారం తెలిపారు. ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న డీడీవో కార్యాలయాన్ని లాలాచెరువు హౌసింగ్‌బోర్డులోని పాత గ్రామ పంచాయతీ భవనంలో, కొవ్వూరు మెయిన్‌రోడ్‌లోని పంచాయతీ రాజ్ అతిథిగృహం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యాలయాలను గురువారం ఉదయం ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 76 రెవెన్యూ డివిజన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన అన్ని డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన వద్దు

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగిన చికిత్స అందుబాటులో ఉన్నందున ప్రజలు నిర్భయంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్నాయన్నారు. వ్యాధికారక కీటకం కుట్టిన ప్రదేశంలో ఎర్రటిమచ్చ కనిపిస్తుందన్నారు. పొలాలు, తోటలు, గుబురు చెట్లు ఉన్న ప్రదేశాలకు వెళ్లేవారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. జ్వరం లేదా అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్యకేంద్రాలను సంప్రదించాలన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

బిక్కవోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని బిక్కవోలు ఎంపీడీవో వీ. శ్రీనివాస్ సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ భవిత కేంద్రంలోని 24 మందికి ఎంఆర్ కిట్లు, తదితర వాటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండ్రాజవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్యసమావేశం ఈనెల 4వతేదీ బుధవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వివిఎస్ రామారావు చెప్పారు. ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని రామారావు కోరారు.

నేడు గోదావరికి మహానీరాజనం

కొవ్వూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అఖండ గోదావరి మాతకు గురువారం 243వ మాసోత్సవ మహానీరాజనం అందజేస్తున్నట్టు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు తెలిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో వేంచేసియున్న గోదావరిమాతకు గురువారం ప్రదోషకాలంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి



బాబూ రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తాళ్లపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పైడిమెట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బాబూ రాజేంద్రప్రసాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. హెచ్‌ఎం దున్నా దుర్గారావు మాట్లాడుతూ బాబూ రాజేంద్రప్రసాద్ బీహార్‌లో 1884 డిసెంబరు 3న జన్మించారని, ఆయన చరిత్రని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతన్న సేవలో ప్రభుత్వం వినూత్న ప్రణాళికలు

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



చాగల్లు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ విద్యార్థులతో ఎమ్మెల్యే

చాగల్లు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం విప్లవాత్మకమైన ప్రణాళికలతో ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన చాగల్లు రైతు సేవా కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటి కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతుల జీవితాల్లో పలు మార్పులు తీసుకొస్తాయని ఆశాభావం వ్యక్తం చేసారు. వైరాలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు గ్రామీణ అవగాహన కృషి అనుభవం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఆయనను కలిసారు. దేశానికి రైతన్న వెన్నెముక అని వారి అభివృద్ధి కోసం కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కూటమి నాయకులు తాళ్లూరి ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు బొల్లిన శివ నాగేంద్ర, అబ్బూరి సీతారాముడు, కూటమి నాయకులు బొడ్డు కేశవకుమార్, వ్యవసాయ అధికారి కే . వేణుగోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎంకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమానికి నల్లజర్ల విచ్చేశారు. పోతవరం రోడ్‌లోని హెలీప్యాడ్ వద్ద ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు.

22న నన్నయలో జాతీయ సెమినార్

దివాన్‌చెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈనెల 22న భారతీయ జ్ఞానవ్యవస్థలను తిరిగి పొందడం, ముందుకు సాగే మార్గం అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలోని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విద్యాభారతి ఉచ్చా శిక్షా సంస్థాన్(వీబీయుఎస్‌ఎస్)సహకారంతో రిక్లెయిమింగ్ ఇండియన్ నాలెడ్జిసిస్టమ్స్ ఫార్వర్డ్ అనే అంశంపై జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వర్సిటీ, అనుబంధ కళాశాలలు, యుజీ, పీజీ స్థాయిలో పాఠ్యాంశాలను అనుసరించడం ద్వారా భారతీయ జ్ఞానవ్యవస్థల గురించి ప్రాథమిక జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం తదనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టడం సెమినార్ లక్ష్యమన్నారు. సెమినార్ కన్వీనర్లుగా ఆచార్య కె.ఎస్.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి,ఎస్.సజ్నారాజ్ వ్యవహరిస్తారన్నారు.

సీఎం సభ సక్సెస్



సీఎం చంద్రబాబు రాకకు ఎదురుచూపులు



సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సాగు పద్ధతులు



సభకు హాజరైన రైతులు



సీఎం చంద్రబాబు అభివాదం



జనం వద్ద సాధారణ వ్యక్తి మాదిరిగా ఉన్న మహిళా పోలీసు

పై ఫొటోలో కొందరు వ్యక్తులు, వాళ్ల వద్ద చుడీదార్ వేసుకున్న ఓ మహిళ ఉన్నారు. వాళ్లందరూ ఒకటే అనుకునేరు! ఆమె పోలీస్ కానిస్టేబుల్. సీఎం బందోబస్తులో భాగంగా సుమారు 50మంది మహిళా పోలీసులను ఇలా మఫ్టీలో రంగంలోకి దింపారు. వాళ్లు సాధారణ జనాల వద్ద ఉంటూ ఏదైనా సమాచారం ఉంటే ఉన్నతాధికారులకు చేరవేశారు.

విందు... పసందు

● 12వేల మందికి భోజన ఏర్పాట్లు



రాజమహేంద్రవరం/గోపాలపురం/దేవరపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రజలకు విందు పసందుగా ఏర్పాటుచేశారు. సీఎం చంద్రబాబు రైతన్న మీకోసం' వచ్చిన వేళ రైతులు, అధికారులు, కార్యకర్తలు, నాయకులు, సామాన్య ప్రజలకు సుమారు 12 వేల మందికి కేసరి స్వీట్, బిర్యానీ, కోడికూర, సాంబారు అన్నం, పెరుగన్నంతో భోజనం వడ్డించారు. ఉదయం 10.30 గంటల నుంచే సుమారు 10 స్టాల్స్ ఏర్పాటు చేయడంతో ఎవరికీ ఇబ్బంది లేకుండా భోజనాలు చేశారు.

వచ్చారిలా...

గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో సీఎం చంద్రబాబు పర్యటించారు. గ్రామంలో జరిగే రైతన్న మీకోసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం 10.20 నిమిషాలకు గ్రామ శివారులో ఉన్న హైవేకు సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద దిగారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 11.40 గంటలకు రైతన్న మీకోసం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. అనంతరం 11.45 గంటలకు ప్రధాన వేదిక వద్దకు సీఎం చేరుకున్నారు. 11.45 నుంచి 1.15 గంటలకు వరకు రైతులతో ముఖాముఖి అయ్యి రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు.

భూ సమస్యలు పరిష్కరించండి

● సీఎం చంద్రబాబుకు వినతి పత్రం

అందించిన జనసేన కన్వీనర్ సువర్ణ రాజు



నల్లజర్లలో సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందిస్తున్న సువర్ణరాజు

నల్లజర్ల, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): జగన్ పాలనతో రైతు భూ హక్కు చట్టాన్ని మన కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసినప్పటికీ, ఆ చట్టం వల్ల నిర్వహించిన రీసర్వే ఫలితంగా ఇంకా ఇప్పటికీ రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వినతిపత్రాన్ని బుధవారం నల్లజర్ల విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. ప్రధానంగా మూడు సమస్యలను వినతి పత్రంలో పొందుపర్చారు. కొన్ని గ్రామాల్లో దళితులకు శ్మశానవాటిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని, ఆక్రమణలో ఉన్న శ్మశానవాటిక సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ద్వారకాతిరుమల మండలం గుండుగోలుగుంటలో అమ్మవారి గుడిలో రూ.5లక్షల విలువ చేసే బంగారం, వెండి చోరీ జరిగిందని, వాటిని పోలీసుల ద్వారా రికవరీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

నిడదవోలు: ఆటో వాహన ఫిట్‌నెస్ కేంద్రాన్ని కొవ్వూరుకు కేటాయించాలని మంత్రి కందుల దుర్గేష్ బుధవారం నల్లజర్లకు వచ్చిన సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కొవ్వూరులో ఉన్న కేంద్రాన్ని రాజానగరం మండలం కావలిచర్ల కేంద్రానికి మార్చారని, ఇది ఆటో కార్మికులకు చాలా దూరం అవుతుందని గతంలో ఉన్న మాదిరిగానే కొవ్వూరులోనే ఈ కేంద్రం ఉండటం వల్ల కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గఆటో డ్రైవర్లకు అనువుగా ఉంటుందన్నారు. ఈ నియోజకవర్గంలో వందలాది ఆటోలు ఉన్నాయని వీరంతా వార్షిక ఫిట్‌నెస్ కోసం రాజానగరం మండలానికి వెళ్లాల్సి వస్తుందని దీన్ని తిరిగి కొవ్వూరుకు కేటాయించడం వల్ల ఆటోడ్రైవర్లకు ఎంతో అనువుగా ఉంటుందని సీఎం దృష్టికి మంత్రి తీసుకెళ్లారు. ఆయనతో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే శ్రీనివాస్ ఉన్నారు.

శీలా వీర్రాజు పుస్తకాలు తెలుగు యూనివర్శిటీకి అపూర్వ నిధి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3 (ఆం ధ్రజ్యోతి): శీలా వీర్రాజు సేకరించిన పుస్తకాల ద్వారా తెలుగు విశ్వవిద్యాలయానికి ఒక అపూర్వ నిధి అందిందని పద్మశ్రీ, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. తూర్పు గోదా వరి జిల్లా రాజమహేంద్రవరం సీపీ బ్రౌన్ మంది రం, మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడ మీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శీలా వీర్రాజు సేకరించిన జాతీయ, అంతర్జాతీయ చిత్రకళా పుస్తకాలను ఆచార్య యార్లగడ్డ, తెలుగు యూనివర్శిటీ వీసీ ఆచార్య డి.మునిరత్నంలకు దామెర్ల ఆర్ట్ గ్యాలరీలలో అందజేశారు. ఈ సంద ర్భంగా ప్రాణహిత కవి సన్నిధానం నరసింహశర్మ అధ్యక్షతన జరిగిన సభలో యార్లగడ్డ మా ట్లాడుతూ ఎన్టీఆర్ మానసిక పుత్రిక అయిన తెలుగు విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఎన్టీఆర్ పుత్రిక అయిన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, విద్యాశాఖ మంత్రి లోకేశ్ సహకరిస్తారనే విశ్వా సం తనకు ఉందన్నారు. తెలుగు యూనివర్శిటీ అభివృద్ధి రాజమహేంద్రవరం ప్రజల బాధ్యత అ న్నారు. తెలంగాణ నుంచి చేరాల్సిన చర స్థిరా స్తుల విషయంలో రెండు వర్సిటీల ఉపకులపతు లు ఒక నిర్ణయానికి రావాలని యార్లగడ్డ కోరారు. వీసీ మునిరత్నం నాయుడు మాట్లాడుతూ శీలా వీర్రాజును తాను గతంలో కలిశానని, ఆయన సే కరించిన పుస్తకాలు తమకు బహూకరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు మాదేటి రవిప్రకాష్, ఆంధ్ర యూనిర్శిటీ రిటైర్డ్ ఆచార్యులు డాక్టర్ పర్వతనేని సుబ్బారావు, భగీరథి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌పీఎస్‌ఎస్ లక్ష్మి, సన్నిధానం శాస్త్రి, మల్లాది శ్రీరామ్, ఇన్‌కంట్యాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ మేడిశెట్టి తిరుమల కుమార్, విశ్రాంత మేజిస్ట్రేట్ ఎస్ఆర్ పృథ్వీ, సామాజిక వేత్త కె.సుర్యకుమారి, అమ్మభగవాన్ సేవకులు మంతెన రాధిక పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఉండాలి

● కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ ● ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న జడ్జి అనురాధ

కొవ్వూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ముందుకు సాగాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గొల్లగూడెంలోని లగడపాటి రామలక్ష్మమ్మ దివ్యాంగుల ఆశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు వైకల్యాన్ని అడ్డంకిగా చూడకుండా ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మర్రి వెంకటేష్, ఎండీవీ ప్రసాద్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

చేతి కర్రల పంపిణీ

కొవ్వూరు దృష్టి ప్రదాత అంధుల పాఠశాలలో జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ఆధ్యాత్మికవేత్త పాలకోడేటి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో దివ్యాంగులకు చేతికర్రలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దుద్దుపూడి రాజారమేష్, ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ పాల్గొన్నారు.

నిడదవోలు: దివ్యాంగులను గౌరవిస్తానని పట్టణ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జువ్వల రాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని లాలాలజపతిరాయ్ మున్సిపల్ పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సమిశ్రగూడెం భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులతో కేక్ కటింగ్ చేయించారు. అనంతరం చిన్నారులకు ఆటల పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజే శారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కేఎస్‌వీ గణేష్, పి. గురుమూర్తి, మండల ప్రజా పరిషత్ అధికారి టీవీ సత్యనారాయణ, హెచ్‌ఎం జిలానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని భవిత సెంటరు వద్ద ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంఈవోలు బాలామణి, నెహ్రూరాజీ హాజరయ్యారు. ఎంఈవో బాలామణి మాట్లాడుతూ దివ్యాంగత్వం ఉన్నదని వెనుకబాటుతనం వద్దని, బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. హృదయాల యపాఠశాలల ఫౌండర్ బలగం విశాల మాట్లాడుతూ మారుతున్న ఆధునిక యుగంలో దివ్యాంగత్వం లేని సంతతి కలిగే విధంగా వైద్యసేవలు మారాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హృదయాలయ సంస్థ సభ్యులు రమేష్ బాబు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ గౌరీనాథ్, ఐఈఆర్‌పీ టీచర్ వెంకటరత్నం, క్రాంతికుమార్, రత్నాబాయి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

దేవరపల్లి: దుద్దుకూరు ప్రాథమిక పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు కే.సుమంత్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలన్నారు. దివ్యాంగులకు ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్న తాను ముందుంటానని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 150 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కేఆర్‌ఎస్‌వీబీ అప్పారావు, ప్రధానోపాధ్యాయులు ఎన్.నీలిమ, డిషబులి టీష్ ఫౌండేషన్ అధినేత ఎం.మోషే రాజు, భవిత కేంద్ర నిర్వాహకులు పెద్దిరాజు, రాజేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఎల్ఆర్ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రాంబాబు

ఉండ్రాజవరం: మోర్తలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం స్థానిక నెం.1 స్కూలులో నిర్వహించారు. ఈ సందర్భంగా పాలంగి సొసైటీ అధ్యక్షుడు కాకర్ల నరసన్న నాని మాట్లాడుతూ దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ఎంఈవో సక్సేనరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శారదాజ్యోత్స్న, ఉపాధ్యాయులు కట్టా శ్రీనివాస్, ఎల్ఆర్ మూర్తి, దివ్యాంగుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీహనుమద్ వ్రత మహోత్సవాలు ప్రారంభం



కొవ్వూరులో ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి



చాగల్లు సెంటర్‌లోని భక్తాంజనేయ స్వామివారి ఆలయంలో పూజలు

కొవ్వూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణ, మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమద్ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొవ్వూరు బస్టాండ్‌సెంటర్‌లోని టాక్సీస్టాండ్‌లో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ వ్రతాలను బుధవారం ప్రారంబించారు. ఆంజనేయస్వామిని వివిధరకాల పు వ్వులతో అలంకరించి పూజలు నిర్వహించారు. అదేవిదంగా గోదావరిగట్టుపై భక్తాంజనేయ స్వామి స్నానఘట్టంలో వేంచేసియున్న ఆంజనేయస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చాగల్లు: మండల కేంద్రమైన చాగల్లు సెంటర్‌లోని శ్రీభక్తాంజనేయస్వామి వారి హనుమద్ వ్రత మహోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. డాక్టర్ రాజనాల సత్య వరప్రసాద్, శ్రీసత్య మంగళ దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి ఉత్సవాలకు కలశ స్థాపన పూజ లు నిర్వహించారు. ఐదురోజుల పాటు జరిగే ఉత్సవాలలో ప్రతిరోజూ స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తారు. రాత్రి సాంస్కృతిక భజన కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. ప్రక్కిలంకలో గల భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు రాజీవ్‌కృష్ణ ఆలయాన్ని దర్శించారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు రాజీవ్ కృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ని దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అల్లూరి విక్రమాదిత్య, సొలస గిరిధర్ గాంధీ, సొలస విశ్వనాథం, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ప్రక్కిలంక భక్తాంజనేయ స్వామిని దర్శించుకున్న రాజీవ్‌కృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, తదితరులు

ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు ప్రజల ఆరోగ్యం, మరోవైపు నిడదవోలు నియోజకవర్గం అభివృద్ధి, ఇంకోవైపు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం సమిశ్రగూడెం ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి స్వయంగా నిడదవోలు నియోజకవర్గంలో అనారోగ్యం బారినపడిన 58 మంది బాధితులకు రూ. 31,91,914 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీ పత్రాలు పంపిణీ పంపిణీ చేశారు. అందులో 54 మందికి రూ. 25,66,914విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, నలుగురికి రూ. 6.25 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను అందించామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం అని , ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటివరకు నిడదవోలు నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి కింద 495 మందికి రూ.3,64,37,367 మేర లబ్ధి చేకూర్చామన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన నాయకులు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, రంగా రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి

కొవ్వూరు: పేద ప్రజల ఆరోగ్యానికి అండగా సీఎం సహాయనిధి నిలుస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొవ్వూరు మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. మండలంలోని ధర్మవరంలో కొత్త వెంకటకృష్ణారావుకు రూ. 50 వేలు, పంగిడి గ్రామంలో మన పాటి రమేష్‌కు రూ. 41,084, ఆరికిరేవుల గ్రామానికి చెందిన ఆర్వ శివన్నారాయణకు రూ. 35వేలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, బేతిన నారాయణ, గారపాటి వెంకట కృష్ణ, సూరపనేని చిన్ని, చావా శ్రీనివాసరావు, చింతపల్లి సతీష్, కొప్పాక విజయ్‌కుమార్, జొన్న బాలకృష్ణ, పెరుగు పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

అంతర్వేదిలో హైకోర్టు జడ్జి పూజలు

అంతర్వేది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హైకోర్టు జస్టిస్ వి.గోపాలకృష్ణారావు బుధవారం కుటుంబసమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో దర్శనం నిర్వహింపచేసి వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



జడ్జికి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం